క్లుప్తంగా

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రరావుకు పరామర్శ


మాజీ జెడ్పీటీసీ మామిడి చంద్రరావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెం కొత్తవీధి: గూడెం కొత్తవీధి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు మామిడి చంద్రరావును పలువురు ఆ పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఆయనను ఇటీవల గ్రామంలో కుక్క తీవ్రంగా గాయపరిచింది. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చంద్రరావును వైస్ ఎంపీపీ లోతా దేముడు, జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్, దేవరాపల్లి ఎంపీటీసీ పోతురాజు విష్ణుమూర్తి, నారాయణ, నరేష్ పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు.

వచ్చేనెల 20 నుంచి మోదమ్మ జాతర



సాక్షి, పాడేరు: చింతలవీధి పంచాయతీ భక్తుల ఆరాధ్య దైవం మోదకొండమ్మతల్లి ఉత్సవాలను వచ్చేనెల 20, 21, 22 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు మంగళవారం నిర్ణయించారు. రెండేళ్లకు ఒకసారి చింతలవీధి మోదమ్మ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది అమ్మవారి మూడు రోజుల జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు సన్నాహాలు చేస్తున్నారు.

సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం రేపు

వై.రామవరం: వై.రామవరం సీహెచ్‌సీలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ తెలిపారు. మండలంలోని యువత తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా సీహెచ్‌సీలో పేర్లు నమోదు చేయించుకోవాలని రాహుల్ కోరారు.

గోపవరం పాఠశాల సందర్శన

రంపచోడవరం: మండలంలోని గోపవరం ఎంపీపీ పాఠశాలను ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఎండ కాలం అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. పాఠశాలలో నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో పనులు మధ్యలో నిలిచిపోయి సిమెంట్ గడ్డకట్టుకుపోవడం గమనించి దీనిపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఐటీయూ నాయకుడికి గాయాలు


ఏలేశ్వరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామరాజుతో స్నేహితులు

రాజవొమ్మంగి: రోడ్డు ప్రమాదంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా రామరాజు మంగళవారం గాయపడ్డారు. ఆయన స్వగ్రామం రాజవొమ్మంగి నుంచి తోటి స్నేహితుడు విజయకుమార్‌తో కలసి బైక్‌పై ఏలేశ్వరం వెళ్తుండగా అడ్డతీగల మండలం గొంతువానిపాలెం వద్ద ఆవు అడ్డురావడంతో కింద పడిపోయారు. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏలేశ్వరం తరలించారు. రామరాజు కుడి చేతి వేళ్లకు శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు.

అసంపూర్తిగా వంతెన పనులు


మధ్యలో ఆగిపోయిన లువ్వాసింగి వంతెన పనులు

పెదబయలు: లక్ష్మీపేట పంచాయతీ లువ్వాసింగి సమీపంలో గెడ్డపై తలపెట్టిన వంతెన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. లువ్వాసింగి గ్రామంలో ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లడానికి మధ్యలో గెడ్డపై వంతెన నిర్మాణం ఆరేళ్ల కిందట చేపట్టారు. ఇప్పటికీ వంతెన పనులు పూర్తి కావలేదు. ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లడానికి అర కిలోమీటర్ వరకు మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దీంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేసి, గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- మత్స్యగెడ్డపై నాటు పడవలపై ప్రయాణాలు
- కార్యరూపం దాల్చని వంతెన నిర్మాణం
- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


నాటు పడవతో చేపల వేట చేస్తున్న గిరిజనులు (ఇన్‌సెట్) వారపు సంతకు వెళ్లేందుకు మత్స్యగెడ్డపై పడవను ఆశ్రయిస్తున్న గిరిజనులు

ప్రమాదమైనా.. తప్పని పడవ ప్రయాణం!

ముంచంగిపుట్టు: నిత్యం మత్స్యగెడ్డ దాటనిదే వారి జీవనం సాగదు. నిత్యావసర సరకులు, వ్యాపార లావాదేవీలు, చదువులు అన్నింటికి మత్స్యగెడ్డపై నాటు పడవలపై రాకపోకలు సాగించాల్సిందే. ఈ ప్రయాణంలో పడవలు మునిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలంలో పనసపుట్టు, సుజనకోట, పెదగూడ, దారెల, వనుగుమ్మ, జోలాపుట్టు, మాకవరం, రంగబయలు పంచాయతీల్లో సుమారు 86 గ్రామాల మీదుగా మత్స్యగెడ్డ విస్తరించి ఉంది. ఆయా గ్రామాల గిరిజనులు ప్రతి రోజు నాటు పడవలపై ప్రయాణించి మండల, పంచాయతీ కేంద్రాలకు పలు పనుల నిమిత్తం వెళ్లొస్తుంటారు. దీంతో పాటు గిరిజన మత్స్యకారులు సైతం నాటు పడవలపైనే చేపల వేటను సాగిస్తున్నారు. వలలకు చిక్కిన చేపలను మండల కేంద్రం, వారపు సంతలకు తీసుకువచ్చి అమ్మకాలు చేసి జీవనం సాగిస్తున్నారు. మత్స్యగెడ్డలో ప్రయాణాలు, చేపల వేటలో సమయాల్లో నాటు పడవలు బోల్తా కొట్టి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

హామీలు నీటిపై రాతలేనా?

ప్రమాదాలు జరిగే సమయాల్లో మాత్రమే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు భరోసా కల్పించే హామీలు గుప్పించి, తరువాత విస్మరించడం పారిపాటిగా మారింది. దీంతో నేతల హామీలు నీటిపై రాతలుగానే మిగులుతున్నాయి. మండలంలో ఆరు పంచాయతీల్లో మత్స్యగెడ్డ పరివాహిక గ్రామాల్లో ప్రభుత్వం లెక్కల ప్రకారం నాటు పడవల ప్రమాదాలలో ఇప్పటి వరకు 91 మంది మృతి చెందారు. ముఖ్యంగా సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామం వద్ద ప్రతి రోజు గిరిజనులు తాడు సహాయంతో బోటుపై గిరిజనులు ప్రమాదభరితంగా దాటుతున్నారు. కుమ్మరిపుట్టు వద్ద వంతెన నిర్మించాలని గత కొన్ని సంవత్సరాలుగా గిరిజనులు పోరాటాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వంతెన నిర్మిస్తామని నేతలు హామీలు ఇచ్చి గెలిచిన తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. గిరిజన మత్స్యకారులు సైతం రూ.30వేలు నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేసి నాటు పడవలను స్వయంగా తయారు చేసుకుని చేపల వేట సాగిస్తున్నారు. వీరికి ఫైబర్ బోట్లు, వలలు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజనులకు రాయితీపై బోట్లు, వలలు అందించి, కుమ్మరిపుట్టు వద్ద వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.


కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

తరచూ ప్రమాదాలతో గిరిజనుల ఆందోళన



మత్స్యగెడ్డపై గిరిజనులు నాటు పడవలపై ప్రయాణాలు చేస్తూ తరచూ ప్రమాదాలు బారిన పడుతున్నారు. చాలా మంది గిరిజనులు నాటు పడవ ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారు. అటువంటి సమయాల్లో నాయకులు హామీలు ఇచ్చి తరువాత మర్చిపోతున్నారు. ప్రమాదాలలో మృతి చెందిన గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలి. గిరిజన మత్స్యకారులకు బోట్లు, వలలు ఉచితంగా అందించాలి. కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలి.

– మజ్జి సుబ్బులక్ష్మి, ఎంపీటీసీ, సుజనకోట సెగ్మెంట్, ముంచంగిపుట్టు మండలం

వంతెన కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు



మండలంలో ఆరు పంచాయతీల్లో మత్స్యగెడ్డ ప్రాంతాల గిరిజనులకు బోట్లు, వలలు రాయితీపై అందించాలని మా దృష్టికి వచ్చింది. దీంతో పాటు కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు చేస్తే వంతెన పనులు మొదలు పెడతాం. నాటు పడవలపై ప్రయాణాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

– ఆర్.వి.ఎస్.నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు

సంప్రదాయాలకు ప్రతీక పండగలు


అంజలి శనివారం గ్రామంలో అమ్మవారిని దర్శించుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: ఏజెన్సీలో గ్రామ దేవతల పండగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మంగళవారం అంజలి శనివారం పంచాయతీ కేంద్రంలోని బోడకొండమ్మ, గంగాలమ్మ, ఎర్రగొండమ్మ తల్లి అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో జరుగుతున్న గ్రామ దేవతల ఉత్సవాలు సందర్భంగా కుటుంబ సంబంధాలు మెరుగుపడడంతో పాటు ఆనందదాయకమైన వాతావరణంలో గడిపే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కొంత సేపు క్రీడాకారులతో ఆటలు ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, సర్పంచ్ పేట్ల రాజుబాబు, మాజీ ఎంపీటీసీ లోచలి భవాని, కిముడు లక్ష్మణరావు, సింహాచలం, లకే గణపతి, కల్యాణం, అశోక్ కుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

3న రాజ్యాంగంపై అవగాహన సదస్సు

కూనవరం: అంబేడ్కర్ యువజన సంఘం, ఏజెన్సీ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చేనెల 3న కాచవరం గ్రామంలో రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ సంఘం నాయకులు ములకల పల్లి కిషోర్, కనకం శ్రీమన్నారాయణ తెలిపారు. కేవీపీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, విద్యావంతులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

90 మందికి నేత్ర వైద్య పరీక్షలు


గుంటగన్నేలలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నేల పంచాయతీలో విశాఖపట్నం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 90 మంది కంటి పరీక్షలు చేయించుకోగా.. అందులో 15 మందికి ఆపరేషన్, ఏడుగురికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి గిరిజన ప్రాంతంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం నుంచి వైద్యులు వచ్చి గిరిజనులకు సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి క్యాంపు కోఆర్డినేటర్ స్వాములు, వైద్యులు గోపాల్, రాజ్‌దీప్, విజన్ టెక్నీషియన్ వై.సత్యనారాయణ, భూపతి, రవింద్ర, తదితరులు పాల్గొన్నారు.

అరకులో అన్నసమారాధన


గంగమ్మతల్లి గుడి వద్ద అన్నసమారాధనలో జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామంలో గంగమ్మతల్లి జాతరను పురస్కరించుకుని మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అరకు పంచాయతీ సర్పంచ్ జి.శారద, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మతల్లి జాతర ప్రతి ఏటా అరకు పంచాయతీ కేంద్రంలో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతరకు వందేళ్లు కావడంతో ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలతో చర్చించేందుకు మంగళవారం పసుపు, కుంకుమతో పాటు అన్నసమరాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి


అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్న సీపీఎం నాయకులు

పాడేరు రూరల్: ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ నెల 9 నుంచి 25 వరకు సీపీఎం చేపట్టిన జిల్లా చైతన్య యాత్ర మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు నేటికీ నోచుకోలేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. 11 మండలాల పరిధిలో 2020 గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గ్రామాల్లో చేసిన అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. అర్హులైన ప్రతి గిరిజనుడికి ఇంటి స్థలం ఇచ్చి నిర్మించాలన్నారు. పీఎం జన్‌మన్ స్కీం కింద మంజూరైన గృహాలకు రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ కొంత మంది రైతులకు నేటికీ అందడం లేదన్నారు. ఉపాధి హామీ పనులు కూడా అంతంత మాత్రంగా జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో రేషన్ కార్డులు, పింఛన్లు, వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ప్రస్తుతం తప్పడం లేదన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రహదారి నిర్మాణాలకు పలు గ్రామాల్లో అటవీ శాఖ ఆంక్షలు విధిస్తుందని, ప్రభుత్వం స్పందించి అనుమతులు తక్షణం మంజూరు చేయాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యలపై మండల పరిషత్, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు వేర్వేరుగా ఆయన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుందర్రావు, దాష్, బొజ్జి, నగేష్, కృష్ణ, రాజు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల పరిరక్షణకు పోరాటం చేయాలి


సంఘీభావం తెలుపుతున్న కార్యవర్గం సభ్యులు

పాడేరు రూరల్: గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక పోరాటం చేయాలని ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం (ఫెడరేషన్) రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు చిట్టపుల్లి శ్రీనివాస్‌పడాల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం పాడేరులోని స్థానిక గిరిజన విద్యార్థి సంఘం భవనంలో మంగళవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకూ ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అన్ని వర్గాల ఆదివాసీ, ఉద్యోగ, ప్రజా సంఘాలు, మేధావులు ఇప్పటికైనా మేలుకోవాలన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న పదోన్నతుల్లో కొన్ని తప్పిదాలను సృష్టించి వివక్ష చూపిస్తున్నారని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకే వంద శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

ఫెడరేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా గంగన్నపడాల్, అధ్యక్షుడిగా గదబరి సోంబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జనార్దనరావు మజ్జి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా లకే ఈశ్వరమ్మ, సహాయ కోశాధికారిగా పాంగి సింహాచలం, ఉపాధ్యక్షుడిగా ఎల్.వి.ఎల్.ఎన్.పాత్రుడు, మరికొంత మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపాధి పనుల్లో వేతనదారుల భాగస్వామ్యం పెంచాలి


అనిగేరులో ఉపాధి హామీ పనులు పరిశీలించి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో అరవాలు

అడ్డతీగల: ఉపాధి పనుల్లో వేతనదారుల భాగస్వామ్యం పెంచాలని అడ్డతీగల ఉపాధి హామీ పథకం ఏపీవో అరవాలు అన్నారు. అడ్డతీగల పంచాయతీలోని అడ్డతీగల, అనిగేరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మస్టర్ షీట్లను పరిశీలించి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. 100 రోజుల పనిదినాలు సాధ్యమైనంత వరకూ ఎక్కువ మంది పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. రోజు వారీ వేతనం రూ.295 చొప్పున మూడు వారాల వేతనాల నగదు విడుదల అయ్యాయన్నారు. నియమ, నిబంధనలు అనుసరించి పనులు చేయించాలని చెప్పారు.

రోడ్డు సదుపాయం కోసం ఎమ్మెల్యేకు విజ్ఞప్తి


రోడ్డు సౌకర్యం కల్పించాలని పాడేరు ఎమ్మెల్యేను కోరుతున్న గ్రామస్తులు

చింతపల్లి: అంజలి శనివారం పంచాయతీ కేంద్రానికి పూర్తి స్థాయి రోడు సౌకర్యం కల్పించాని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును పలు గ్రామాలు గిరిజనులు కోరారు. మంగళవారం అంజలి శనివారం గ్రామంలో గ్రామ దేవత పండగకు హాజరైన ఎమ్మెల్యేను తిరుగు ప్రయాణంలో పలు గ్రామాల గిరిజనులు కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పంచాయతీ కేంద్రం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికి పూర్తి స్థాయి రోడ్డు సౌకర్యం లేక రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో ప్రజల సమక్షంలోనే ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటికే అనేక మార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తికి అవసరమైతే గ్రామస్తులతో కలసి ఉద్యమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంగళరావు, సర్పంచ్ రాజుబాబు, పలు గ్రామాలు గిరిజనులు పాల్గొన్నారు.

ఈకేవైసీ సరే.. పథకాలు అమలెక్కడ?


ముంచంగిపుట్టు సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, రేషన్ కార్డుదారులు

ముంచంగిపుట్టు సచివాలయం ఎదుట రేషన్ కార్డుదారుల ఆందోళన

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు గానీ ఈకేవైసీ పేరుతో ప్రజలను మాత్రం అవస్థలకు గురిచేస్తోందని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు మట్టంముఖి శ్రీను ఆరోపించారు. మండల కేంద్రం ముంచంగిపుట్టు సచివాలయంలో ఈకేవైసీ చేసే కిట్లు లేక, సర్వర్ సమస్య, ఆధార్ అప్‌డేట్ జరగపోవడంతో పిల్లలతో వచ్చి రేషన్ కార్డుదారులు మంగళవారం నానా అవస్థలు పడ్డారు. ఈ సమస్యలను గిరిజన సంఘం నేతల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులు మంగళవారం గ్రామ సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం ఇవ్వాలని, ఈకేవైసీకి గడువు పెంచాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతున్నా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్ వంటి సాకులు చూపి వచ్చే రేషన్ సరకులను మాత్రము నిలుపుదల చేసేందుకు పూనుకోవడం దారుణమన్నారు. పిల్లలతో సహా లబ్ధిదారులు వచ్చి గ్రామ సచివాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోందని, అధికారులు స్పందించి ఈకేవైసీ సమయం పెంచాలని డిమాండ్ చేశారు. కించాయిపుట్టు పీసా కమిటీ ఉపాధ్యక్షుడు చిట్టపుల్లి విశ్వనాథం, అధిక సంఖ్యలో కార్డుదారులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పెంచాలి

పెదబయలు: తెల్ల రేషన్‌కార్డుల్లో ఉన్నవారందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. పెదబయలు మండలంలో 39 డీఆర్ డిపోల పరిధిలో 51 వేల మంది జనాభా ఉన్నారు. కార్డులో ఉన్నవారంతా ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలనే ఆదేశాలతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. దూర ప్రాంతాల్లో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీసుకుని వచ్చి నమోదు చేయడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతుందన్న వేసవి సెలవుల వరకు ఈకేవైసీ గడువు పెంచాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు, నాయకులు సందడి కొండబాబు, పండా సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మారుమూల గ్రామాల్లో నెట్ సదుపాయం లేక ఈకేవైసీ ప్రక్రియ సజావుగా సాగడం లేదన్నారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


జి.మాడుగుల మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి ధర్మన్నపడాల్, తదితరులు

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సాగేని ధర్మన్నపడాల్ డిమాండ్ చేశారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ చీమలపాడు, చినకొత్తూరు, గొడుగురాయి, గడ్రాయి, తదితర గిరిజన గ్రామాల్లో తాగునీరు, సాగునీరు కల్పించాలని, డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న చెక్ డామ్ పనులను పూర్తి చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మన్నపడాల్ మాట్లాడుతూ చీమలపాడులో ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నారు. చెక్‌డామ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గడ్రాయి, కొత్తూరు గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు నిలిపి వేయడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సన్యాసిదొర, ధర్మారావు, ఈశ్వరరావు, సత్తిబాబు, ఆశీర్వాదం, బాలబాబు, కాలేష్, తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి



రంపచోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

రంపచోడవరం: కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద మంగళవారం గిరిజనులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం నాయకత్వంలో సుమారు 100 మంది గిరిజనులు ఆందోళనలో పాల్గొన్నారు. సబ్ ప్లాన్ ఏరియా ప్రత్తిపాడు మండలంలో వంతాడ గ్రామంలో ఆదివాసీ గిరిజన కొండదొర కులానికి చెందిన 83 కుటుంబాలు ఏలేశ్వరం రేంజ్ లింగంపర్తిలో 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని కమిటీ కార్యదర్శి గణేశ్వరరావు తెలిపారు. 2000 సంవత్సరం నుంచి గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వంతాడ గ్రామానికి రోడ్డు వేయాలని, ఎర్రమట్టి మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీవోను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.